గాడి తప్పిన కాంగ్రెస్ పాలన

- ఇచ్చిన హామీలను మరిచిన రాష్ట్ర సర్కార్
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

కోరుట్ల: లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, నవంబర్ 6: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడి తప్పిందని, ఇచ్చిన హామీలను మరిచి కమీషన్ల కోసం వెంపర్లాడుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. మూసీ నది ప్రక్షాళనను కమీషన్ల కోసం ముందుకు తెచ్చాడన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కేంద్రాల్లో గన్నీ బ్యాగులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ప్రోత్సాహకంతో పాటు తులం బంగారం ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యలపై సీఎం స్పందించకపోవడం విచారకరమన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ప్రోత్సాహకం మంజూరు చేయించే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి నారాయణ రెడ్డి, దారిశెట్టి రాజేశ్, ఫహీం, బట్టు సునీల్, పోగుల ఉమారాణి, నత్తి రాజ్‌కుమార్, అంజయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 6: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన చిలివేరి శ్వేత అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ. లక్ష ఎల్వోసీ మంజూరైంది. కాగా, శ్వేత తండ్రికి బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఎల్వోసీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం శేఖర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అనిరెడ్డి మారుతి, ఆరెళ్ల రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం

జగిత్యాలటౌన్: కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్, పక్కన కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి/సారంగాపూర్/జగిత్యాల టౌన్/ రూరల్/ కథలాపూర్/ వెల్గటూర్/ మల్యాల/ పెగడపల్లి/ ఇబ్రహీంపట్నం/ కోరుట్ల/ కోరుట్లరూరల్/ కొడిమ్యాల, నవంబర్ 6: జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే బుధవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. మూడు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించడం జరుగుతుందని, ఈ నెల 9 నుంచి వివరాలను సేకరిస్తారని అధికారులు పేర్కొన్నారు. కాగా, మెట్‌పల్లి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో చేపట్టిన సర్వేలో ఎంపీడీవోలు చౌడారపు గంగాధర్, లచ్చాలు, తహసీల్దార్లు జమీర్, ముంతాజొద్దీన్, ఎంపీవో శశికుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో చేపట్టిన సర్వేను మండల ప్రత్యేకాధికారి బోనగిరి నరేశ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్వే సూపర్‌వైజర్ కందుకూరి రవిబాబు, తదితరులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలంలో చేపట్టిన సర్వేను మండల ప్రత్యేకాధికారి మదన్‌మోహన్, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఆర్ఐ నాగేశ్, కార్యదర్శి సాయినాథ్, సత్యనారాయణ, ఇస్మాయిల్ ఉన్నారు. వెల్గటూర్ మండలంలో తహసీల్దార్ ఆర్ శేఖర్, డీటీ గంగాధర్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు. మల్యాల మండలం నూకపల్లిలో చేపట్టిన సర్వేను అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. వివరాలు సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో స్వాతి, కార్యదర్శి రాధ, తదితరులున్నారు. పెగడపల్లి మండలంలో నిర్వహించిన సర్వేలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో మహేందర్, డీటీ రాజశేఖర్, ఏఈ శంషేర్‌అలీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాయకులు రాములు గౌడ్, తిరుపతి, విజయభాస్కర్, ప్రశాంత్, కిషన్, వంశీ, ఎల్లయ్య పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో తహసీల్దార్ ప్రసాద్, కార్యదర్శులు రాకేశ్, రవళి, కోరుట్ల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మండలంలో ఎంపీడీవో వోదెల రామకృష్ణ, తహసీల్దార్ ఇట్యాల కిషన్, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొడిమ్యాలలోని ఇందిరానగర్ కాలనీలో చేపట్టిన సర్వేను ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్, కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత పరిశీలించారు. పూడూర్‌లో చేపట్టిన సర్వేను అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో స్వరూప పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి

కొడిమ్యాల: కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్, కలెక్టర్ సత్యప్రసాద్

- కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్
- ధాన్యం కొనుగోళ్లు, సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

కొడిమ్యాల, నవంబర్ 6: ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అధికారులకు సూచించారు. మండలంలోని పూడూర్, కొడిమ్యాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ, ధాన్యం తేమ శాతం వచ్చిన వెంటనే తూకం వేయాలన్నారు. కేంద్రాల్లో రైతులకు వసతులను కల్పించాలని ఆదేశించారు. అలాగే, కొడిమ్యాలలోని ఇందిరానగర్ కాలనీలో ఇంటింటా కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, ఆర్డీవో మధుసూదన్, డీఆర్డీవో రఘువరన్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో స్వరూప, ఏపీఎం రాజేశ్, ఎస్యూమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల, నవంబర్ 6: రామన్నపేట గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్, కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలు, తూకం వేసిన ధాన్యం, మిల్లుల కేటాయింపు, గన్నీ సంచులు, తదితర వివరాలు సేకరించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. అనంతరం సమీపంలోని పల్లెదవాఖానను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీపీవో రఘువరన్, ఆర్డీవో పులి మధుసూదన్, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో అవునూరి స్వాతి, ఎంపీవో ప్రవీణ్, ఐకేపీ ఏపీఎం చిన్న రాజయ్య, రైతులు తదితరులున్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

జగిత్యాల రూరల్, నవంబర్ 6: జగిత్యాల పట్టణాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 44వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలో పారిశుధ్య పనుల కోసం 16 ఆటోలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో రోడ్ల నిర్మాణ పనులు త్వరలోనే చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి,

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

ఏఈ చరణ్, వంజరి సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు దూమాల రాజ్‌కుమార్, పెద్దింటి రాజు, దాసు, రాము, శంకర్, గోపీ, రాములు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పాలం బాట

పెగడపల్లి, నవంబర్ 6: ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు గానూ రైతులు వ్యవసాయ విద్యుత్ మోటర్లకు నాణ్యమైన పరికరాలను వినియోగించాలని జగిత్యాల డీఈ రాజిరెడ్డి సూచించారు. సుద్దపల్లి గ్రామంలో బుధవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఏడీఏ వరుణ్‌కుమార్, బతికపల్లి ఏఈ మధు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ప్రాక్టికల్ ల్యాబ్ ప్రారంభం

కోరుట్ల, నవంబర్ 6: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ ప్రాక్టికల్ ల్యాబ్‌ను జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌసూర్ రహ్మాన్, అధ్యాపకులు గంగాప్రసాద్, ఇమ్రాన్ ఖాన్, నటరాజన్, హబీబ్, వంశీకృష్ణ, డింగరి ప్రశాంత్, సంజీవ్, సుబ్రహ్మణ్యం, జయదేవ్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సినాల్ దుర్గా, కథలాపూర్, మెట్‌పల్లి ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు నారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

జగిత్యాల టౌన్, నవంబర్ 6: గ్రామ పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టినట్లు గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవో నంబర్ 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కేటగిరీ వారీగా వేతనాలను అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్, డీపీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పులి మల్లేశం, కోరెపు మల్లేశం, శాతల్ల రాజేందర్, గుడిసె దేవయ్య, మ్యాతరి మల్లవ్వ, జంగిలి ఎల్లయ్య, గాజుల రామయ్య, వి.రాజన్న, మేకల పోచయ్య, కనికరపు సత్తయ్య, పల్లెమీది రేఖ, గుండు నర్సయ్య, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

జగిత్యాల టౌన్, నవంబర్ 6: రాష్ట్రంలో వృద్ధులు ఆత్మహత్యకు పాల్పడితే వారి మృతి పట్ల విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కౌన్సెలింగ్ కేంద్రంలో వృద్ధుల ఆత్మహత్య, పిల్లల వేధింపులు, అభద్రత నివారణ అంశంపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘం సభ్యులు గౌరిశెట్టి విశ్వనాథం, పీసీ హన్మంతరెడ్డి, బొల్లం విజయ్, ఎండీ యాకూబ్, పూసాల అశోక్‌రావు, సత్యనారాయణ, సతీశ్‌రాజ్, కిషన్, సింగం గంగాధర్, నారాయణ, భూమయ్య, ఇంద్రయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ విఫలం

ఇటిక్యాలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత

రాయికల్, నవంబర్ 6: ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఇటిక్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, పంటను అమ్ముకునే సమయంలో రైతన్నకు ఎలాంటి కష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులదేనని అన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే తూకం వేయాలని ప్రభుత్వానిన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మారంపెల్లి రాణి-సాయికుమార్, రాయికల్ పట్టణాధ్యక్షుడు అనిల్, నాయకులు నారాయణ గౌడ్, రాజేందర్ గౌడ్, కొల్లూరి వేణు, రొట్టె శ్రీను, రుక్కు, శ్రీనివాస్ గౌడ్, బర్కం మల్లేశ్, కంటే గంగారాం, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

సుద్దపల్లిలో పశువైద్య శిబిరం

పెగడపల్లి, నవంబర్ 6: సుద్దపల్లి గ్రామంలో బుధవారం మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి హేమలత, పంచాయతీ కార్యదర్శి నదీంహుస్సేన్, పశు వైద్య సిబ్బంది మతిన్, వినీత్, జానీపాషా, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత

మేడిపల్లి, నవంబర్ 6: కాచారం గ్రామానికి చెందిన న్యాత అక్షయ ఆసిఫాబాద్‌లో బీఎస్సీ నర్సింగ్ సీటు సాధించింది. అడ్మిషన్ ఫీజు కోసం ఉదయం ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ. 8 వేల నగదు అందజేశారు. సభ్యులు బాలరాజు, మహేశ్, న్యాత రాజం, గడుగు చిన్న రాజయ్య, మ్యాకల గంగాధర్, బర్ల అనుదీప్, దాసరి శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్, నవంబర్ 6: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లచ్చాలు సూచించారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి, కొల్వాయి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన మాజీ ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, రైతులు ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నవీన్ రావు, సీసీలు రమేశ్ నాయక్, పుష్పలత, మాజీ ప్రజాప్రతినిధులు సృజనసుశిన్, సుభాష్, రవి, లక్ష్మణ్, ఏసుదాసు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్, నవంబర్ 6: మండలంలోని గుండంపల్లి, గొర్రెపల్లి, సిరిపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, మొగిలిపేట, ఓబులాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడ్పుల పుష్పలత ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, నవంబర్ 6: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎలిశెట్టి భూంరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అన్నం అనిల్, పుప్పాల ప్రభాకర్, ఏఆర్ అక్బర్, శ్రీనివాస్‌గౌడ్, భూమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాల్గొన్నారు.

గొల్లపల్లి, నవంబర్ 6: బొంకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, నవంబర్ 6: ఎర్దండి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రసాద్ ప్రారంభించారు. ఆయన వెంట సహకార సంఘం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మల్లాపూర్, నవంబర్ 6: మండలంలోని రాఘవపేట, నడికుడ, సిరిపూర్, మల్లాపూర్, సాతారం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం, నవంబర్ 6: గోదూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు జేడీ సుమన్, పురుషోత్తం, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

మెట్‌పల్లి, నవంబర్ 6: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు బుధవారం పట్టుకున్నారు. పట్టణ శివారులోని వట్టివాగు సమీపంలో తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో ఓ లారీని తనిఖీ చేయగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ కుమార్‌ను విచారించగా కథలాపూర్ నుంచి ఆర్మూర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మేడిపల్లి, నవంబర్ 6: మండల కేంద్రానికి చెందిన అంకం బక్కన్నకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 19,500 ఆర్థిక సాయం మంజూరైంది. లబ్ధిదారుకు బుధవారం మాజీ ఎంపీటీసీ మకిలి దాస్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దేశవేని కృష్ణ, నాయకులు అజీత్‌రావు, ఎండీ అన్సర్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, భవనాల శాఖ ఏఈఈగా లక్ష్మీకాంత్

కథలాపూర్, నవంబర్ 6: రోడ్లు, భవనాల శాఖ కథలాపూర్ సెక్షన్ ఏఈఈగా లక్ష్మీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు మెట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

రైతులకు శిక్షణ

జగిత్యాల టౌన్, నవంబర్ 6: పొలాస ప్రాంతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలత, డాక్టర్ రజినీకాంత్, డాక్టర్ గొన్యానాయక్, డాక్టర్ ఎన్ బలరాం, డాక్టర్ రవి, డాక్టర్ ఎన్ సాయినాథ్, డాక్టర్ రజినీదేవి, స్వాతి, డాక్టర్ కే స్వాతి, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

కొడిమ్యాల, నవంబర్ 6: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మైదానంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలను ఎస్ఐ సందీప్ ప్రారంభించారు. బాలికల విభాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు ప్రథమ, జగిత్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో జగిత్యాల జిల్లా జట్టు ప్రథమ, రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, లక్ష్మీనాయక్, విశ్వప్రసాద్, అశోక్, శ్రీనివాస్, లక్ష్మణ్, సంపత్ ,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల ఔదార్యం

సారంగాపూర్, నవంబర్ 6: పెంబట్ల-కోనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థి దొడ్డవారి సుమలత భర్త నారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు బుధవారం ఇటిక్యాలలో ఉంటున్న సుమలత కుటుంబానికి రూ. 50 వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో తేలు రాజు, గోపి, మహేశ్, రాజేశ్, నాగరాజు, స్నేహ, జమున, వరలక్ష్మి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరం

కథలాపూర్, నవంబర్ 6: మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ దవాఖాన వైద్యులు బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు హర్షిత్ 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. ఏడుగురికి మెరుగైన చికిత్స అవసరమని, కరీంనగర్‌లోని దవాఖానకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, మైస శ్రీధర్, సంజీవ్ రెడ్డి, సతీశ్‌గౌడ్, ప్రసాద్‌రెడ్డి, దవాఖాన సిబ్బంది కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబర్ 6: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కుటుంబ సర్వేను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వివరాలు పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఎంపీడీవో రవీందర్, కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి

జగిత్యాల టౌన్, నవంబర్ 6: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి కేంద్రాలను సందర్శించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో బుధవారం ఆయన కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, కటింగ్ పేరిట మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని, ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌వో, డీఎంవో, వ్యవసాయాధికారి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

జగిత్యాల రూరల్, నవంబర్ 6: తిప్పన్నపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత తనిఖీ చేశారు. కేంద్రంలో సదుపాయాలు, ధాన్యం వివరాలు, తేమశాతం పరిశీలించార